Follow: @mahaadaily
REGISTERED NUMBER: APTEL/2014/58382
18-12-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 359 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD
గురువారం
WWW.EPAPER.MAHAADAILY.COM


ANN తెలుగు



**టాప్ న్యూస్**

## జూబ్లీహిల్స్ లో నేడు చిరంజీవి అభిమానుల భేటీ

- మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం విజయం కోసం ఫ్యాన్స్ సన్నాహాలు
- జనవరి 12న విడుదల కానున్న మెగాస్టార్ కొత్త చిత్రం



02

## కొత్త యుగం ఆరంభం


- చమురుపై వెండి పైచేయి
- 40 ఏళ్ళ రికార్డు బ్రేక్



02

## తెలంగాణలో జనసేన

- పవన్ కల్యాణ్ మాస్టర్ స్కెచ్
- నేడు పది జిల్లాల నేతల కీలక భేటీ



02

### మూడు రంగుల జెండా పట్టి..

# మూడు విడతల్లో జై కొట్టి..

## ఫేజ్ ఏదైనా.. తీర్పు ఒక్కటే

**రేవంత్ పాలనకు జైకొట్టిన పల్లెలు**

మూడో విడతలోనూ.. కాంగ్రెస్ ప్రభంజనం

రెండో స్థానంలో బీఆర్ఎస్.. మూడో స్థానంలో బీజేపీ

త్వరలో సర్పంచ్ లతో సీఎం రేవంత్ ఆత్మీయ సమ్మేళనం

మూడురంగుల జెండాకే మూడువిడతల్లోనూ ప్రజలు జైకొట్టారు. రేవంత్ పాలనకు పల్లెజనం పట్టం కట్టారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో తొలివిడత నుండి మూడోవిడత దాకా అదే ప్రభంజనం.. అదే ఊపు. తెలంగాణ గ్రామాల్లో కాంగ్రెస్ చాలా గట్టిగా పాతుకుపోయిందని పంచాయితీ ఎన్నికలు నిరూపించాయి. మూడు దశల్లో జరిగిన ఈ పల్లెపోరులో ప్రతీదశలోనూ కాంగ్రెస్ మద్దతుదారులే పైచేయి సాధించారు. మిగతా పార్టీలు ఎక్కడా తమ దరిదాపుల్లో కూడా చేరుకోలేని అఖండ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఎన్నిక ఏదైనా విజయం కాంగ్రెస్ దే అన్నట్లుగా ప్రజలు మద్దతు పలికారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి పల్లెల్లో కాంగ్రెస్ ప్రభంజనాన్ని చూసి నేతలు.. క్యాడర్ ఆనంద పరవశులవుతున్నారు. మూడురంగుల జెండా పట్టి.. రేవంతన్నకు జైకొట్టి ఆనందపరవశులవుతున్నారు. ఫేజ్ ఏదైనా.. ప్రజలు ఒకే ఫేస్ చూశారు. రేవంత్ నాయకత్వానికే జై కొట్టారు.

- మహా, హైదరాబాద్



**మూడు విడతలు కలిపి..**

మొత్తం గ్రామపంచాయతీలు **12,548**

| | |
|---|---|
| కాంగ్రెస్ గెలుపు | 6,900 |
| బీఆర్ఎస్ గెలుపు | 3,490 |
| బీజేపీ గెలుపు | 700 |
| ఇతరులు | 1600 |

02



# ఆధారాల్లేవ్

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ తీర్పు

భద్రాచలం, శేరిలింగంపల్లి, గద్వాల, పటాన్ చెరు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలకు ఊరట

ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కొట్టివేత .. నేడు మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం

కడియం, దానం పిటిషన్లపై విచారణ పెండింగ్.. స్పీకర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం ఎంపీ మల్లు రవి

ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీష్ రావు

స్పీకర్ నిర్ణయం.. రాజ్యాంగ వ్యతిరేకం బిజెపి రాష్ట్ర చీఫ్ రామచందర్ రావు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక తీర్పునిచ్చారు. ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. వారిపై అనర్హత వేటు వేసేందుకు తగిన ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు సరైన ఆధారాలు చూపలేదని తీర్పు సందర్భంగా స్పీకర్ పేర్కొన్నారు. ఇందులో బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు ఉన్నారు.

మిగతా 2లో

### రాజ్యాంగాన్ని కాలరాయడమే..

**- మాజీ మంత్రి హరీష్ రావు**



రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పరిహాసం చేసిందని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగంపై ఢిల్లీలో ఒక మాట.. తెలంగాణలో మరోమాట మాట్లాడుతోందని రాజ్యాంగంపై రాహుల్ నినాదం తెలంగాణలో వర్తించదా అని ప్రశ్నించారు. స్పీకర్ నిర్ణయంతో కాంగ్రెస్ ద్వంద్వ విధానం బట్టబయలైందన్నారు. ఢిల్లీలో రాజ్యాంగం పరిరక్షణపై మాట్లాడే కాంగ్రెస్ రియల్ ఫేస్ తెలంగాణలో స్పీకర్ తీర్పుతో బయటపడిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగ సంస్థలను కూడా దిగజార్చడం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెల్లిందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో ర్జాయంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీ-డిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టి అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగాన్ని కాలరాయడమేనన్నారు.

### స్పీకర్ పై విమర్శలు సరికాదు

**- ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్**



ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల పైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయానికి అంతా కట్టుబడి ఉండాల్సిందే. సభాపతి ఇరుపక్షాల వాదనలు విని మెరిట్ ఆధారంగా తీర్పు ఇచ్చారు. స్పీకర్ పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. బీఆర్ఎస్ పార్టీ కూడా ఫిరాయింపులపైన మాట్లాడటం ఆశ్చర్యం. టీడీపీ ఎమ్మెల్యే తలసాని ని క్యాబినెట్ లోకి తీసుకోవడం మరిచిపోయారా? కాంగ్రెస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని మంత్రి వర్గంలోకి తీసుకున్న విషయం మరిచిపోయారా..? 10 ఏళ్లలో 39 మంది ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో చేర్చుకోవడం మరిచిపోయారా? గత పదేళ్లలో ఫిరాయింపులపైన ప్రతిపక్షాలు ఫిర్యాదు చేసినా స్పీకర్లు పట్టించుకోలేదు. ఫిరాయింపులపైన మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ కూడా టీడీపీ నుంచి టీఆర్ఎస్ లోకి ఫిరాయించాడు అని ఆదిశ్రీనివాస్ ఫైర్ అయ్యారు.

### నేను పార్టీ మారలేదు: కడియం శ్రీహరి



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులపై స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. బుధవారం స్పీకర్‌కు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదని స్పష్టం చేశారు. పార్టీ మారాను అనేది పచ్చి అబద్ధం అని పేర్కొన్నారు. కావాలనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన చెందారు.

## సంగారెడ్డిలో లక్ష మందితో భారీ సభ

### రాముడి పేరుతో బీజేపీ విభజన రాజకీయం

నెహ్రూ, గాంధీల చరిత్ర చెరిపే కుట్ర!

మోదీకి నెహ్రూను విమర్శించే అర్హత లేదు

ప్రజా సమస్యలు గాలికి.. గాంధీ కుటుంబంపై గురి

కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి



**హైదరాబాద్, మహా:** పార్లమెంట్ వేదికగా ప్రజాస్వామ్య విలువలకే ముప్పు వాటిల్లేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం హైదరాబాద్ గాంధీభవన్లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత పడుతున్న ఇబ్బందులపై పార్లమెంట్ లో చర్చించే సాహసం చేయలేని ప్రధాని మోదీ, కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నెహ్రూ, గాంధీ కుటుంబాలను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం కోసం ఆస్తులను, ప్రాణాలను దారాదత్తం చేసిన ఘనచరిత్ర నెహ్రూ కుటుంబానిదని, అలాంటి త్యాగధనులను చూసి బీజేపీ నేతలు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.

మిగతా 2లో



## హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ముర్ము

- ఐదు రోజుల విడిది కోసం రాక
- హకీంపేట ఎయిర్ పోర్టులో స్వాగతం పలికిన గవర్నర్, మంత్రులు

**హైదరాబాద్, మహా :** శీతాకాల విడిది నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానం ద్వారా రాష్ట్రపతి ముర్ము హకీంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. రాష్ట్రపతి ముర్ముకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు,

మిగతా 2లో

## టీటీఏ సేవలపై ప్రశంసల జల్లు

కొనసాగుతున్న 'టీటీఏ' సేవా డేస్ 2025.. హయత్ నగర్ లో కృత్రిమ అవయవాల పంపిణీ




**హైదరాబాద్, మహా :** తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ 'టీటీఏ సేవా డేస్ 2025'లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా హయత్‌నగర్‌లోని పొదార్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో 'టీటీఏ సేవా డేస్ 2025' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శారీరక వైకల్యం ఉన్న అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు పంపిణీ చేశారు.

మిగతా 2లో



## పల్లెల్లో కాంగ్రెస్ ప్రభంజనం

- మూడో విడతలోనూ ఘనవిజయం
- సీఎం రేవంత్ ప్రజాపాలనకు గ్రామీణ ప్రజల పట్టం
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హర్షం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మూడో విడత సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లోనూ కాంగ్రెస్ మద్దతుదారులు అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడంపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం పల్లెల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న తిరుగులేని ఆదరణకు నిదర్శనమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం

మిగతా 2లో

# మూడురంగుల జెండా పట్టి.. మూడు విడతల్లో జై కొట్టి..

(మొదటిపేజీ తరువాయి)

మూడో విడత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం కనిపించింది. మొత్తం మొత్తం 4,158 స్థానాల్లో ఎక్కువ చోట్ల గెలిచి ఆధిక్యాన్ని చాటారు. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, కామారెడ్డి, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. మూడో దశ ఎన్నికల కోసం 182 మండలాల్లో మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడగా.. అందులో 11 సర్పంచి పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 394 పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు 287, బీఆర్ఎస్ 42, బీజేపీ 9, ఇతరులు 57 స్థానాల్లో ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగింది. భోజన విరామం తర్వాత పోలింగ్ అధికారులు ఓట్ల లెక్కింపు ప్రారంభించారు.

**2వేలకు పైగా**

మూడోవిడతలోనూ కాంగ్రెస్ పార్టీ 2వేలకు పైగా గ్రామపంచాయతీలను గెలవగా, బీఆర్ఎస్ వేయికి పైగా, బీజేపీ 200కు పైగా సర్పంచ్ స్థానాలను గెలిచింది. మూడు విడతలు కలిపి తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ దాదాపు 7వేల పంచాయతీలు గెలవగా, దాదాపు 3వేలు బీఆర్ఎస్, 600కు పైగా బీజేపీ గెలిచింది. కాంగ్రెస్ ప్రతీ పల్లెలోనూ ప్రభంజనంలా విజయదుందుభి మోగించింది. గెలిచిన మరుసటి రోజు నుండి స్వతంత్రులు కాంగ్రెస్ లో చేరుతున్నారు.

**త్వరలో సర్పంచ్‌లతో సీఎం సమావేశం**

కాంగ్రెస్ నుంచి గెలిచిన కొత్త సర్పంచులతో త్వరలో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. తుది విడత పంచాయితీ ఎన్నికల తరువాత ఈ నెల 22న సర్పంచుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. ఆ తర్వాత హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సర్పంచులతో సీఎం రేవంత్ రెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు. సర్కార్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్ళడం, సంస్థాగతంగా కాంగ్రెస్ క్యాడర్ ను బలోపేతం చేయడం వంటి అంశాలపై సర్పంచులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేయనున్నారు.

# ఆధారాల్లేవ్...

(మొదటిపేజీ తరువాయి)

ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టుగా ఆధారాలు చూపలేదని తీర్పులో పేర్కొన్నారు. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్టుగా ఆధారాలు లేవన్న స్పీకర్ అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని స్పష్టం చేశారు. సాంకేతికంగా చూస్తే ఐదుగురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్టుగా తెలిపారు. మొత్తం 10 మంది ఎమ్మెల్యేల గురించి అనర్హత పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి అయింది. దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్ల మీద విచారణ పూర్తి కావాల్సి ఉంది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌కు సంబంధించిన తీర్పు గురువారం వెల్లడించనున్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్‌ను దాఖలు చేశారు. స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇటీవల ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. స్పీకర్ మీద సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

**సుప్రీం ఆదేశాల మేరకు**

జూలై 31, 2025న అనర్హత పిటిషన్లపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోకపోవడంపై కోర్టు ధిక్కార పిటిషన్‌ను కూడా బీఆర్ఎస్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా విచారణ చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యేల అనర్హతపై మీరు నిర్ణయం తీసుకుంటారా? మేము తీసుకోవాలా ? అని తెలంగాణ స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో కోర్టుధిక్కరణ పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. స్పీకర్‌కు రాజ్యాంగ రక్షణ లేదని మేం ముందే చెప్పామని, న్యూ ఇయర్ ఎక్కడ జరుపుకోవాలో ఆయనే నిర్ణయించుకోవాలని సుప్రీం కోర్టు సీరియస్ అయింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఈ నెల 19వ తేదీన మరోసారి సుప్రీం కోర్టు విచారణ చేయనుంది. ఎనిమిది మందికి సంబంధించి విచారణ చేసిన తెలంగాణ స్పీకర్ ఐదుగురికి సంబంధించి తీర్పు చెప్పారు. గురువారం మరో ముగ్గురికి సంబంధించిన తీర్పు రానుంది.

## జూబ్లీహిల్స్‌లో నేడు చిరంజీవి అభిమానుల భేటీ

**మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం విజయం కోసం ఫ్యాన్స్ సన్నాహాలు**

**జనవరి 12న విడుదల కానున్న మెగాస్టార్ కొత్త చిత్రం**

**హైదరాబాద్, మహా :** మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న కొత్త చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాను భారీ విజయం దిశగా నడిపించేందుకు అభిమాన సంఘం కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా, అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో రేపు హైదరాబాద్‌లో ఒక కీలక సమావేశం జరగనుంది. సినిమా ప్రమోషన్, విడుదల సమయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఈ భేటీలో చర్చించనున్నారు. ఈ సమావేశం గురువారం ఉదయం 9:09 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ప్రారంభం కానున్నట్లు అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. జనవరి 12న విడుదల కానున్న ఈ సినిమాను ప్రతి ఒక్క ప్రేక్షకుడి వద్దకు తీసుకెళ్లి, ఘన విజయాన్ని అందించాలని అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత తరపున ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రేక్షకులకు వినోదాన్ని అందించడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటల్లో ఆయన ఎంతో హుషారుగా, చార్మింగ్‌గా కనిపించి ఆకట్టుకున్నారు. అభిమానులమంతా కలిసికట్టుగా పనిచేసి ఈ సినిమాకు భారీ విజయాన్ని అందిద్దాం" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని విషయాలు చర్చించి, సినిమా విజయం కోసం పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ముర్ము

(మొదటిపేజీ తరువాయి)

సీతక్క ఘనస్వాగతం పలికారు. ముర్ము అక్కడి నుండి నేరుగా సికింద్రాబాద్‌లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయానికి వెళ్లారు. ఈ విడిదిలో భాగంగా ఆమె మొత్తం ఐదు రోజుల పాటు ఇక్కడే బస చేస్తారు. రాష్ట్రపతి పర్యటనలో భాగంగా అల్వాల్, బొల్లారం ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

**రాష్ట్రపతి ముర్ము పర్యటనలోని కార్యక్రమాలు**

రాష్ట్రపతి తన 5 రోజుల పర్యటనలో పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటారు. డిసెంబర్ 19న రాష్ట్రపతి ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించనున్నారు. అక్కడ జరగనున్న ఆలిండియా పబ్లిక్ సర్వీస్ కమిషనర్ల జాతీయ సదస్సును ప్రారంభించనున్నారు. అనంతరం డిసెంబర్ 20వ తేదీన గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ సంస్థ నిర్వహించే సదస్సులో పాల్గొంటారు. డిసెంబర్ 21న రాష్ట్రపతి నిలయంలో సాధారణ పౌరులతో ఆమె భేటీ, తరువాత ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాష్ట్రపతి శీతాకాల విడిది పర్యటనను పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ వరకు అల్వాల్, గచ్చిబౌలి పరిధిలో డ్రోన్లు, పారా గ్లైడర్లు, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఎగురవేయడంపై పోలీసులు నిషేధం విధించారు. అదే రోజు సాయంత్రం ప్రత్యేకవిమానంలో ఆమె ఢిల్లీకి బయలుదేరనున్నారు.

**రాష్ట్రపతి నిలయం: చారిత్రక నేపథ్యం, విశేషాలు**

హైదరాబాద్‌లోని బొల్లారం ప్రాంతంలో ఉన్న రాష్ట్రపతి నిలయం దేశంలోని 3 అధికారిక రాష్ట్రపతి నివాసాలలో ఒకటి. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్, సిమ్లాలోని 'ది రిట్రీట్' తర్వాత దక్షిణాదిలో రాష్ట్రపతి బస చేసే ఏకైక ప్రాంతం ఇదే. బొల్లారంలోని రాష్ట్రపతి శీతాకాల విడిది భవనాన్ని 1860లో అప్పటి హైదరాబాద్ నిజాం నిర్మించారు. ఆ తర్వాత ఇది బ్రిటిష్ రెసిడెంట్ నివాసంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దీనిని ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత ప్రభుత్వానికి అప్పగించారు. సుమారు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనం ప్రాంగణంలో అందమైన ఉద్యానవనాలు, హెర్బల్ గార్డెన్స్ ఉన్నాయి. రాష్ట్రపతి భవన్ సంప్రదాయం ప్రకారం, ప్రతి ఏడాది జనవరి నెలలో రాష్ట్రపత నిలయాన్ని సామాన్య ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంచుతారు. అయితే ప్రస్తుతం రాష్ట్రపతి బస చేస్తున్నందున భద్రతా కారణాల దృష్ట్యా అక్కడ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

## అదుపు తప్పిన కమలం క్రమశిక్షణ

- ప్రధాని 'క్లాస్'ను వీధిలో పెట్టిన ఎంపీలెవరు?
- ఎంపీల పనితీరుపై మోదీ అసహనం
- పార్టీలో సొంత నేతల పైనే 'నిఘా' నేత్రం!




**హైద్రాబాద్, మహా:** భారతీయ జనతా పార్టీ.. క్రమశిక్షణకు మారుపేరు. ఆ పార్టీలో అధినాయకత్వం ఆజ్ఞాపిస్తే అది వేదవాక్కు. సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక విషయంపై "గోప్యత" పాటించాలని చెబితే, అది మారుమాటా లేకుండా అమలు కావాలి. కానీ, తెలంగాణ బీజేపీలో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇటీవల దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో ప్రధాని మోదీ నిర్వహించిన అంతర్గత సమావేశం వివరాలు 'లీక్' అవ్వడం ఇప్పుడు కాషాయ దళంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఢిల్లీ గడప దాటనివ్వొద్దన్న చర్చ కాస్తా.. గల్లీల్లోని సోషల్ మీడియా గ్రూపుల వరకు చేరడంతో అమిత్ షా బృందం కూడా విస్మయానికి గురైనట్లు తెలుస్తోంది.

దక్షిణాదిలో పాగా వేయడమే లక్ష్యంగా ప్రధాని మోదీ ఇటీవల ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ ఎంపీలతో ముఖాముఖి భేటీ అయ్యారు. పార్టీ బలోపేతం కోసం వ్యూహాలు పంచుకోవాల్సిన ఈ సమావేశం.. తెలంగాణ ఎంపీలకు ఊహించని 'బూస్టర్ డోస్' కాకుండా 'షాక్ ట్రీట్‌మెంట్'గా మారింది. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు గెలిచినా, క్షేత్రస్థాయిలో పార్టీ గ్రాఫ్ ఎందుకు పెరగడం లేదని ప్రధాని సూటిగా ప్రశ్నించినట్లు సమాచారం.

ఈ భేటీలో మోదీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ బీజేపీలో హాట్ టాపిక్. "మీరు ఎంపీలుగా గెలిచారు సరే.. కానీ ప్రజల్లో మీకు ఉండాల్సిన 'కనెక్ట్' ఏది?" అని ఆయన ప్రశ్నించారట. ముఖ్యంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం లేదని, కేంద్ర పథకాలను జనాల్లోకి తీసుకెళ్లడంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారట. విపక్ష ఎంపీగా ఉండి కూడా అసదుద్దీన్ ఒవైసీ తన గొంతును ఎలా వినిపిస్తున్నారు? అంతకంటే మెరుగైన ఫలితాలు మీరు ఎందుకు సాధించలేకపోతున్నారు? అని మోదీ వేసిన ప్రశ్నలకు ఎంపీలు నీళ్లు నమిలినట్లు వార్తలు వస్తున్నాయి.
ఈ రహస్య భేటీ వివరాలు మీడియాలో హైలైట్ అవ్వడంపై కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మీడియా చిట్‌చాట్‌లో ఆయన వాడిన పదజాలం చూస్తుంటే విషయం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. "ప్రధానితో జరిగిన చర్చలను బయటపెట్టిన వారు 'మెంటల్‌గాళ్లు'" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోని ప్రత్యర్థి వర్గాలను ఉద్దేశించినవే అన్న చర్చ నడుస్తోంది. లీక్ చేసిన వారు ఎవరో తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించడం ద్వారా.. పార్టీలో క్రమశిక్షణ కరువైందని ఆయన పరోక్షంగా ఒప్పుకున్నట్లయ్యింది.

ఇప్పుడు బీజేపీ వర్గాల్లో జరుగుతున్న అతిపెద్ద వేట.. ఆ లీకు వీరుడి కోసమే! కర్ణాటక లేదా కేరళ ఎంపీలకు తెలుగు మీడియా ప్రతినిధులతో సంబంధాలు ఉండవు. కాబట్టి, తెలంగాణకు చెందిన ఎంపీల్లో ఎవరో ఒకరే ఈ వివరాలను చేరవేసి ఉంటారని అధిష్ఠానం అనుమానిస్తోంది. రాష్ట్రంలో ఒకరిపై ఒకరు ఆధిపత్యం చాటుకోవడానికి, ప్రత్యర్థి వర్గంపై మోదీ సీరియస్ అయ్యారని చూపించడానికి ఈ లీకులను ఆయుధంగా వాడుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

సొంత పార్టీ ఎంపీలపైనే నిఘా పెట్టాల్సిన పరిస్థితి రావడం బీజేపీ లాంటి కేడర్ బేస్డ్ పార్టీకి మింగుడు పడని అంశం. మరి ఈ 'లీకుల' గొడవ ఎక్కడికి దారితీస్తుందో? అధిష్ఠానం ఆ మెంటల్‌గాళ్లను గుర్తించి చర్యలు తీసుకుంటుందో లేక ఈ ప్రకంపనలు తెలంగాణ బీజేపీలో మరిన్ని చీలికలకు దారితీస్తాయో చూడాలి.

## కొత్త యుగం ఆరంభం

**చమురుపై వెండి పైచేయి**

**40 ఏళ్ళ రికార్డు బ్రేక్**

**మహా :** అంతర్జాతీయ మార్కెట్‌లో ఓ సంచలనం ఆవిష్కృతమైంది. గత 40 ఏళ్లలో తొలిసారి వెండి ధర ముడి చమురు ధరను అధిగమించింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా వెండి ధర ఒక ఔన్స్‌కు 63.06 డాలర్లుగా ఉంది. మరోవైపు ముడి చమురు ధర ఒక బ్యారెల్‌కు 56.19 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ముడి చమురు కంటే వెండి దాదాపు 6 డాలర్ల ప్రీమియంలో ఉండటం గమనార్హం. ఇలాంటి పరిస్థితి చివరిసారిగా 1979లో కనిపించింది. నిపుణులు దీనిని "కొత్త యుగానికి ఆరంభం"గా అభివర్ణిస్తున్నారు. వెండి పెరుగుతుంటే, ముడి చమురు ధరలు మాత్రం గత 4 ఏళ్ల కనిష్ఠానికి పడిపోయాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 60 డాలర్ల కిందకు జారిపోయింది. చైనా, ఐరోపా దేశాల్లో ఆర్థిక మందగమనం వల్ల చమురుకు డిమాండ్ తగ్గడం, సరఫరా అధికంగా ఉండటం ఇందుకు ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు.

## తెలంగాణలో జనసేన

**పవన్ కల్యాణ్ మాస్టర్ స్కెచ్**

**నేడు పది జిల్లాల నేతల కీలక భేటీ**

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో జనసేన పార్టీని విస్తృతస్థాయిలో తీసుకువెళ్లాలని సూచించిన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 18వ తేదీన కీలక సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల పార్టీ శ్రేణులు మరియు గ్రేటర్ హైదరాబాద్ పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గం ఇన్చార్జిలు, పీఓసీ సభ్యులు, వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, వీర మహిళలు, క్రియాశీలక వాలంటీర్లు వారి వారి నియోజకవర్గాల నుండి పార్టీ శ్రేణులు అందరూ పాల్గొనేలా బాధ్యత తీసుకొని ఈ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకత్వం ప్రకటన విడుదల చేసింది. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచులుగా, వార్డ్ మెంబర్లుగా జనసేన పార్టీ తరపున పోటీచేసి విజయం సాధించి ఈ సమావేశంలో సన్మానించనున్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన అభ్యర్థులు ఈ సమావేశంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచనలు చేశారు. ఆశావహులు అందరూ పాల్గొనాలని పేర్కొన్నారు.

## టీటీపీఏ సేవలపై ప్రశంసల జల్లు

(మొదటిపేజీ తరువాయి)

పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు హాజరై ఈ సేవా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని టీటీపీఏ అధ్యక్షుడు నవీన్ రెడ్డి మల్లిపెద్ది, టీటీపీఏ మెగా కన్వెన్షన్ కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి చింతారెడ్డి, రమేశ్ రెడ్డి దేవరం, యూత్ కమిటీ చైర్ ప్రణవి మల్లిపెద్ది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీపీఏ అధ్యక్షుడు నవీన్ మల్లిపెద్ది మాట్లాడుతూ.. టీటీపీఏ వ్యవస్థాపకుడు డా. పైళ్ల మల్లారెడ్డి, ఏసీ చైర్ డా. విజయపాల్ రెడ్డి, ఏసీ కోచైర్ డా. మోహన్ రెడ్డి పటలోళ్ల, ఏసీ సభ్యులు భరత్ రెడ్డి మదాది, శ్రీని అనుగు, మాజీ అధ్యక్షుడు వంశీ రెడ్డి కంచర్కుంట్ల, సేవా డేస్ కోఆర్డినేటర్ విశ్వ కందితో పాటు కార్యక్రమానికి హాజరై పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారుల ముఖాల్లో కనిపించిన ఆనందం, కృతజ్ఞత భావం టీటీపీఏ సభ్యులు, వాలంటీర్లకు మరిన్నో సేవలు చేయాలనే తపన కలిగించిందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సేవ, కరుణ, సామాజిక అభివృద్ధి అనే టీటీపీఏ లక్ష్యాలను మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సేవ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని, టీటీపీఏలో భాగస్వాములై ఆశ, సంరక్షణ, సాధికారతను తెలంగాణ సమాజమంతటా విస్తరించేందుకు ముందుకు రావాలని టీటీపీఏ నాయకులు పిలుపునిచ్చారు.

## గాంధీని రెండోసారి చంపడమే

**మాజీ కేంద్ర మంత్రి చిదంబరం ఫైర్**

**ఢిల్లీ, మహా :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఇది జాతిపితను రెండోసారి హత్య చేయడమేనని ఆయన అభివర్ణించారు. యూపీఏ హయాంలో ప్రవేశపెట్టిన ఈ పథకం పేరును మార్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ లైవ్లీహుడ్ మిషన్ (రూరల్)' బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిపై ఆయన స్పందించారు. "ఇన్నాళ్లూ జవహర్‌లాల్ నెహ్రూను అప్రతిష్ఠపాలు చేసిన బీజేపీ ప్రభుత్వం, ఇప్పుడు మహాత్మా గాంధీని లక్ష్యంగా చేసుకుంది" అని ఆరోపించారు. 2004 బడ్జెట్‌లో ఈ పథకాన్ని తానే ప్రకటించానని గుర్తుచేశారు. "భారతీయుల జ్ఞాపకాల నుంచి గాంధీని చెరిపేయాలని వారు ప్రయత్నిస్తున్నారు. పిల్లలకు గాంధీ గురించి తెలియకూడదు, ప్రజలు ఆయన పేరును స్మరించుకోకూడదు అన్నదే వారి ఉద్దేశం" అని ఆయన విమర్శించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడో విడత ఫలితాలు వివరాలు

**మహా నెట్ వర్క్:** భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ 101, బీఆర్ఎస్ 19 ఓట్లు సాధించగా, బీజేపీకి ఒక్క ఓటు కూడా పడలేదు, ఇతరులకు 35 ఓట్లు లభించాయి. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 31, బీఆర్ఎస్‌కు 62, బీజేపీకి 11, ఇతరులకు 46 ఓట్లు వచ్చాయి. హన్మకొండలో కాంగ్రెస్ 40, బీఆర్ఎస్ 24, బీజేపీ 3, ఇతరులకు 1 ఓటు వచ్చాయి. జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ 61, బీఆర్ఎస్ 35, బీజేపీ 4, ఇతరులు 15 ఓట్లు పొందారు. జనగామలో కాంగ్రెస్ 56, బీఆర్ఎస్ 18, బీజేపీ 1, ఇతరులు 6 ఓట్లు సాధించారు. జయశంకర్ భూపాలపల్లిలో కాంగ్రెస్ 49, బీఆర్ఎస్ 39 ఓట్లు సాధించగా, ఇతరులకు 2 ఓట్లు వచ్చాయి. జోగులాంబ గద్వాలలో కాంగ్రెస్ 25, బీఆర్ఎస్ 32, ఇతరులు 18 ఓట్లు పొందారు. కామారెడ్డిలో కాంగ్రెస్ 125, బీఆర్ఎస్ 21, బీజేపీ 4, ఇతరులు 17 ఓట్లు సాధించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ 99, బీఆర్ఎస్ 34, బీజేపీ 1, ఇతరులు 18 ఓట్లు పొందారు. ఖమ్మంలో కాంగ్రెస్ 125, బీఆర్ఎస్ 21, బీజేపీ 4, ఇతరులు 17 ఓట్లు లభించాయి. కుమురం భీం ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ 40, బీఆర్ఎస్ 37, బీజేపీ 10, ఇతరులు 13 ఓట్లు పొందారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ 65, బీఆర్ఎస్ 49, బీజేపీ 5, ఇతరులు 13 ఓట్లు సాధించారు. మహబూబ్ నగర్‌లో కాంగ్రెస్ 113, బీఆర్ఎస్ 45, ఇతరులకు 8 ఓట్లు వచ్చాయి. మంచిర్యాలలో కాంగ్రెస్ 43, బీఆర్ఎస్ 18, బీజేపీ 1, ఇతరులకు 3 ఓట్లు పడ్డాయి. మెదక్‌లో కాంగ్రెస్ 73, బీఆర్ఎస్ 86, బీజేపీ 9, ఇతరులు 15 ఓట్లు సాధించారు. మేడ్చల్ మల్కాజిగిరిలో కాంగ్రెస్ 84, బీఆర్ఎస్ 50, బీజేపీ 27, ఇతరులు 11 ఓట్లు పొందారు. ములుగులో కాంగ్రెస్ 30, బీఆర్ఎస్ 8, బీజేపీ 1, ఇతరులు 7 ఓట్లు సాధించారు. నాగర్ కర్నూల్‌లో కాంగ్రెస్ 99, బీఆర్ఎస్ 34, బీజేపీ 1, ఇతరులు 18 ఓట్లు పొందారు. నల్గొండలో కాంగ్రెస్ 169, బీఆర్ఎస్ 60, బీజేపీ 2, ఇతరులు 33 ఓట్లు సాధించి భారీ ఆధిక్యం కనబరిచింది. నారాయణపేటలో కాంగ్రెస్ 52, బీఆర్ఎస్ 27, బీజేపీ 15, ఇతరులు 14 ఓట్లు పొందారు. నిర్మల్‌లో కాంగ్రెస్ 28, బీఆర్ఎస్ 6, బీజేపీ 73, ఇతరులు 25 ఓట్లు సాధించారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ 79, బీఆర్ఎస్ 37, బీజేపీ 14, ఇతరులు 28 ఓట్లు పొందారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ 66, బీఆర్ఎస్ 21, బీజేపీ 3 ఓట్లు సాధించింది. రాజన్న సిరిసిల్లలో కాంగ్రెస్ 15, బీఆర్ఎస్ 39, బీజేపీ 9, ఇతరులు 22 ఓట్లు పొందారు. రంగారెడ్డిలో కాంగ్రెస్ 155, బీఆర్ఎస్ 67, బీజేపీ 5, ఇతరులు 7 ఓట్లు సాధించారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ 129, బీఆర్ఎస్ 44, ఇతరులు 14 ఓట్లు పొందారు. సిద్దిపేటలో కాంగ్రెస్ 70, బీఆర్ఎస్ 62, బీజేపీ 7, ఇతరులు 19 ఓట్లు సాధించారు. సూర్యాపేటలో కాంగ్రెస్ 102, బీఆర్ఎస్ 32, ఇతరులు 9 ఓట్లు పొందారు. వికారాబాద్‌లో కాంగ్రెస్ 56, బీఆర్ఎస్ 48, బీజేపీ 4, ఇతరులు 9 ఓట్లు సాధించారు. వనపర్తిలో కాంగ్రెస్ 47, బీఆర్ఎస్ 22, బీజేపీ 3, ఇతరులు 15 ఓట్లు పొందారు. వరంగల్‌లో కాంగ్రెస్ 72, బీఆర్ఎస్ 35, ఇతరులకు 1 ఓటు వచ్చింది. యాదాద్రి భువనగిరిలో కాంగ్రెస్ 71, బీఆర్ఎస్ 35, బీజేపీ 7, ఇతరులు 10 ఓట్లు సాధించారు. చివరిగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4101 ఓట్లకుగాను కాంగ్రెస్ 2224, బీఆర్ఎస్ 1149, బీజేపీ 240 మరియు ఇతరులు 466 ఓట్లు సాధించినట్లు పట్టిక స్పష్టం చేస్తోంది.

## పల్లెల్లో కాంగ్రెస్ ప్రభంజనం

- మూడో విడతలోనూ ఘనవిజయం
- సీఎం రేవంత్ ప్రజాపాలనకు గ్రామీణ ప్రజల పట్టం
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హర్షం



(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి బలంగా చొచ్చుకుపోయాయనడానికి ఇది ఒక సాక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వరుసగా మూడు విడతల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టడం తెలంగాణ రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మార్పుకు సంకేతమని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ఓటర్లు ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ ప్రభుత్వ పనితీరుకు పట్టం కట్టారని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన, సంక్షేమం మరియు అభివృద్ధి పథకాలు నేరుగా సామాన్య ప్రజల దరికి చేరుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై నమ్మకం రెట్టింపు అయిందని ఆయన విశ్లేషించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు స్థానిక నేతలు ఒకే తాటిపైకి వచ్చి సమన్వయంతో సాగించిన బలమైన ప్రచార వ్యూహాలే ఈ అఖండ విజయానికి పునాది వేశాయని ఆయన కొనియాడారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఓటర్లు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న తీరు గ్రామీణ ఓటర్లలో పార్టీ పట్ల విశ్వాసాన్ని మరింత పెంచిందని పీసీసీ అధ్యక్షుడు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సంక్షేమం అనే నినాదంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పరిపాలన సాగిస్తోందని చెప్పారు. దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం ఒక నూతన రాజకీయ సంస్కృతికి నాంది అని ఆయన వెల్లడించారు. ఈ విజయం తమపై బాధ్యతను మరింత పెంచిందని, రానున్న రోజుల్లో పంచాయతీ రాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రతి గ్రామాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మూడో విడత ఫలితాలు ప్రతిపక్షాలకు గట్టి హెచ్చరిక అని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటూ గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేస్తుందని మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## పసుపు రైతుల అభ్యున్నతే ధ్యేయం

**పసుపు సదస్సులో మంత్రి తుమ్మల దిశానిర్దేశం**

**హైదరాబాద్, మహా:** పసుపును కేవలం పంటగా చూడకుండా, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చోదక శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక సదస్సులో ఆయన మాట్లాడుతూ, మన సంస్కృతిలో అంతర్భాగమైన పసుపుకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఔషధ రంగాలు మరియు పోషకాహార ఉత్పత్తుల్లో గిరాకీ పెరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన వ్యవసాయ విజన్ 2047లో పసుపు సాగుకు అత్యున్నత ప్రాధాన్యత కల్పించామని, దీని ద్వారా రైతులకు మెరుగైన భవిష్యత్తును అందించడమే లక్ష్యమని వివరించారు. నిజామాబాద్ మరియు ఆర్మూర్ ప్రాంతాల పసుపుకు ఉన్న విశిష్టతను గుర్తు చేస్తూ, ఆర్మూర్ పసుపుకు లభించిన భౌగోళిక గుర్తింపు తెలంగాణ రైతాంగానికి దక్కిన గౌరవమని మంత్రి కొనియాడారు. అయితే, సాగు ఖర్చులతో పోలిస్తే విపణిలో లభిస్తున్న ధరలు రైతులకు ఆశించిన స్థాయిలో లాభాలను అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. క్వింటా పసుపు పండించడానికి రైతు సుమారు తొమ్మిది వేల రూపాయలు ఖర్చు చేస్తుండగా, అమ్మకం ధర పన్నెండు వేల రూపాయల లోపే ఉండటం వల్ల రైతులకు ఆశించిన ప్రతిఫలం దక్కడం లేదని పేర్కొన్నారు.

## సంగారెడ్డిలో లక్ష మందితో భారీ సభ

(మొదటిపేజీ తరువాయి)

పన్నెండేళ్ల పాటు కఠినమైన జైలు జీవితం గడిపిన నెహ్రూను, దేశం కోసం ప్రాణాలిచ్చిన వారిని అవమానించడం అంటే భారత ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. అసలు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పుట్టిన మోదీకి, అమిత్ షాకు ఆనాటి ఉద్యమకారుల గురించి, గాంధీ, నెహ్రూల త్యాగాల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని జగ్గారెడ్డి ఘాటుగా స్పందించారు. ఒకనాడు జాతిపిత మహాత్మా గాంధీ 'రఘుపతి రాఘవ రాజారాం' అంటూ రాముడి పేరుతో దేశ ప్రజలందరినీ ఏకం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిస్తే, నేడు బీజేపీ అదే రాముడి పేరును అడ్డుపెట్టుకుని ప్రజల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని విడదీస్తోందని జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాముడి పేరు చెప్పి మూడుసార్లు అధికారంలోకి వచ్చిన మోదీ, పేదవాడి అకౌంట్లో 15 లక్షలు వేస్తానన్న హామీని మాత్రం పూర్తిగా విస్మరించారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలపై చర్చ జరగకుండా ఉండేందుకే వ్యూహాత్మకంగా ప్రతిపక్ష నేతలపై, గతించిన మహనీయులపై బురదజల్లుతున్నారని ఆరోపించారు. మోదీ ఈరోజు ఇంత స్వేచ్ఛగా ప్రధానమంత్రి కుర్చీలో కూర్చున్నారంటే అది గాంధీ కుటుంబం తెచ్చిన స్వాతంత్ర్యం, అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలమేనని, ఆ విషయాన్ని మరిచిపోయి ప్రవర్తించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కేవలం ఒక్కరోజు జైల్లో ఉండాలంటేనే కాళ్లు చేతులు వణికే బీజేపీ నేతలు, ఏళ్ల తరబడి జైలు జీవితం గడిపిన నెహ్రూను విమర్శించడం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తం మహాత్మా గాంధీ ఐడియాలజీని ఆదర్శంగా తీసుకుని నడుస్తుంటే, దేశంలో మాత్రం బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూకలు గాంధీ పేరు లేకుండా చేయాలని చూస్తున్నాయని జగ్గారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆఖరికి డిజిటల్ కరెన్సీలో కూడా గాంధీ బొమ్మ లేకుండా చేయాలనే కుట్రపూరిత ఆలోచనలు చేస్తున్నారని, ఇది వారి దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. గాంధీ కుటుంబం అంటే బీజేపీకి భయంతో కూడిన అసూయ అని, ప్రజల హృదయాల నుంచి వారిని ఎవరూ చెరిపేయలేరని స్పష్టం చేశారు. నెహ్రూ, గాంధీలపై మోదీ, అమిత్ షాలు చేస్తున్న నిరంతర దాడులను తిప్పికొట్టేందుకు, వారి కుట్రలను ప్రజల్లో ఎండగట్టేందుకు త్వరలోనే సంగారెడ్డి వేదికగా భారీ ఎత్తున నిరసన సభను ఏర్పాటు చేయనున్నట్లు జగ్గారెడ్డి ప్రకటించారు. సుమారు లక్ష మందితో నిర్వహించే ఈ సభ ద్వారా ఢిల్లీ పీఠం కదిలేలా నినదిస్తామని, సభ తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.



## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆమనగల్లు విద్యార్థి

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండా గ్రామపంచాయతీ పరిధిలోని దయ్యాలబోడు తండాకు చెందిన ఎన్.సాయి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే అండర్ 17 జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు.రాష్ట్రస్థాయిలో కబడ్డీ పోటీలో ఎంపికైన విద్యార్థిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు,తండావాసులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో పాఠశాల పేరును నిలిపినందుకు, అలాగే క్రీడా రంగంలోపాఠశాలకు గుర్తింపు తెచ్చినందుకు అభినందించారు.

# సిడ్నీ కాల్పుల ఘటనలో హైదరాబాద్ లింక్

### ఇక్కడ స్లీపర్ సెల్స్ ఉండొచ్చన్న బీజేపీ

- హైదరాబాద్ తో సంబంధాలుండటం తెలంగాణకు అవమానం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు

**హైదరాబాద్, మహా :** ఆస్ట్రేలియా సిడ్నీలోని బోండి బీచ్‌లో యూదులు హనుక్కా ఉత్సవం జరుపుకొంటుండగా ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఇద్దరు వ్యక్తులు కాల్పులు చేశారు. ఈ ఘటనలో 15 మంది మృతిచెందారు. ఈ దాడి చేసినవారిలో ఒకరైన సాజిద్ అక్రమ్ హైదరాబాద్ టోలిచౌకికి చెందినవాడు. మరో వ్యక్తి అతడి కుమారుడు, ఆస్ట్రేలియా పౌరుడైన నవీద్ అక్రమ్. ఈ కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి పాల్గొనడం భారతదేశానికి అవమానం మాత్రమే కాదు, భద్రతాపరమైన ఆందోళన కూడా అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. 'ఆస్ట్రేలియాలో సిడ్నీ ఉగ్రవాద చర్యతో హైదరాబాద్ సంబంధం, మాకు అవమానకరమైన విషయమే. అంతేకాదు ఇది తీవ్రమైన జాతీయ భద్రతా సమస్య కూడా.' అని రామచందర్ రావు చెప్పారు. నిందితులు భారత్ విడిచి వెళ్ళడానికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరిపి దర్యాప్తు చేయాలని తెలంగాణ పోలీసులను రామచందర్ రావు కోరారు. ఈ సంఘటన ప్రమాదకరమైన ధోరణిని ప్రతిబింబిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితుల కుటుంబ చరిత్రపై పోలీసు విచారణ జరపాలని పార్టీ




కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. 'దురదృష్టవశాత్తు, ఇందులో పాల్గొన్న వ్యక్తులు భారతదేశానికి చెందినవారు, అది కూడా హైదరాబాద్‌కు చెందినవారు. 27 సంవత్సరాల క్రితం హైదరాబాద్ నుండి బయటకు వెళ్లారు. హైదరాబాద్‌లో ఇప్పటికీ ఐఎస్ఐ, ఐఎస్ఐఎస్ కోసం చాలా స్లీపర్ సెల్స్ ఉన్నాయని నేను భావిస్తున్నాను.' అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు చెప్పాడు.

**దాడిలో 15 మంది మృతి**

సిడ్నీలోని బోండి బీచ్‌లో జరిగిన హనుక్కా కార్యక్రమంలో 50 ఏళ్ల సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు నవీద్ అక్రమ్ దాడి చేశారు. 15 మంది మరణించగా, అనేక మందికి గాయాలు అయ్యాయి. పోలీసులు జరిపిన కాల్పుల్లో సాజిద్ అక్కడే మరణించాడు. నవీద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటి వరకు సాజిద్ భారతీయ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉన్నాడని ఫిలిప్పీన్స్ బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ మంగళవారం తెలిపింది. అతడు హైదరాబాద్‌కు చెందినవాడని, కానీ 1998లో ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడని తెలంగాణ పోలీసులు నిర్ధారించారు. కుటుంబంతో సంబంధాలు తక్కువగా ఉన్నాయని గుర్తించారు. సాజిద్ కాల్పుల వార్తల తర్వాత అతని కుటుంబ సభ్యులు తమ ఇంటిని వదిలి తెలియని ప్రదేశానికి వెళ్లిపోయారని తెలుస్తోంది. సాజిద్ అక్రమ్ గురించి దర్యాప్తు బృందాలు ఆరా తీస్తున్నాయి. అతను చివరి సారిగా 2022లో హైదరాబాద్ వచ్చాడు. అది కూడా ఆస్తులకు సంబంధించిన వ్యవహారంపై వచ్చినట్టుగా తెలుస్తోంది. ఆస్ట్రేలియాకు వెళ్లిన తర్వాత మొత్తం ఆరు సార్లు వచ్చాడు సాజిద్. సాజిత్ అక్రమ్ తండ్రి 2017 లో మరణించాడు. ఆయన అంత్యక్రియలకు కూడా హాజరు కాలేదు. హైదరాబాద్‌లో కామర్స్‌లో బ్యాచిలర్స్ పూర్తి చేసిన తర్వాత 1998లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. అక్రమ్ ఆస్ట్రేలియాకు వెళ్లి ఒక యూరోపియన్ మహిళను వివాహం చేసుకున్నాడు. అతడికి ఒక కుమారుడు (నవీద్ అక్రమ్), కుమార్తె ఉన్నారు. సాజిద్ తన భారతీయ పాస్‌పోర్ట్‌ను తన వద్దే ఉంచుకున్నాడు.

# జర్మనీలో రాహుల్ గాంధీ పర్యటన

### బీఎండబ్ల్యూ కేంద్రం సందర్శన.. భారతీయ నైపుణ్యంపై ప్రశంసలు






**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన ఐరోపా పర్యటనలో భాగంగా జర్మనీలోని మ్యూనిక్ నగరంలో పర్యటించారు. అక్కడ ఉన్న ప్రపంచ ప్రఖ్యాత వాహన తయారీ సంస్థ బీఎండబ్ల్యూ ప్రధాన కార్యాలయాన్ని, ప్రదర్శనశాలను ఆయన బుధవారం సందర్శించి, వాహన రంగంలో వస్తున్న మార్పులను, ఆధునిక తయారీ విధానాలను దగ్గరుండి గమనించారు. ఈ పర్యటనలో రాహుల్ గాంధీ బీఎండబ్ల్యూ ఎఫ్ 450 జీఎస్ మోటార్‌సైకిల్‌ను ప్రత్యేకంగా పరిశీలించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ మోటార్‌సైకిల్ భారతీయ దిగ్గజ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ, బీఎండబ్ల్యూ భాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న మోడల్ కావడం విశేషం. పరాయి గడ్డపై భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యం ప్రతిబింబించేలా ఉన్న ఈ వాహనంపై ఆయన కూర్చుని కాసేపు పరీక్షించారు. జర్మనీలో మన దేశ సాంకేతిక ప్రతిభను చూడటం ఎంతో గర్వకారణమని ఆయన ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ప్లాంట్‌లోని మ్యూజియం విభాగాన్ని సందర్శించారు. అక్కడ చరిత్రలో నిలిచిపోయిన పాతకాలపు కారు 'బీఎండబ్ల్యూ ఇసెట్టా'ను ఆసక్తిగా తిలకించారు. దీనిని ముద్దుగా 'బబుల్ కార్' అని పిలుస్తారు. అక్కడే ప్రదర్శించిన అత్యాధునిక మినీ కూపర్ కార్లు, ఇతర బీఎండబ్ల్యూ మోడళ్లను ఆయన వీక్షించారు. వాహన తయారీలో జర్మనీ పాటిస్తున్న ప్రమాణాలు, సాంకేతిక విప్లవం గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శన ముగిసిన తర్వాత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ భారత ఆర్థిక వ్యవస్థ, తయారీ రంగంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా తయారీ రంగమే వెన్నుముక లాంటిదని, కానీ దురదృష్టవశాత్తు ప్రస్తుతం భారతదేశంలో ఈ రంగం ఆశించిన స్థాయిలో వృద్ధి చెందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి వేగవంతం కావాలంటే ఉత్పత్తిని పెంచాలని, సరైన వసతులు కల్పించి భారీ ఎత్తున నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రస్తుతం ఐరోపా పర్యటనలో ఉంటూ ప్రవాస భారతీయులను, విద్యార్థులను, వివిధ రంగాల నిపుణులను కలుసుకుంటున్నారు. మ్యూనిక్ పర్యటనలో వాహన రంగాన్ని పరిశీలించడం ద్వారా, భారతదేశంలో ఉత్పాదక రంగానికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను ఆయన మరోసారి గుర్తు చేశారు.



## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

### గ్రామ అభివృద్ధే తమ ధ్యేయం: కోర్ర దేవా నాయక్

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా మాజీ సర్పంచ్ కోర్ర దేవా నాయక్ సర్పంచ్ ఎన్నికలలో ఒక్క ఓటు తేడాతో ఓటమిపాలయ్యారు. తమ ప్యానెల్ లోని ఉప సర్పంచ్ కోర్ర స్వరూప వార్డు సభ్యులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. మదనపల్లి కొత్త తండా గ్రామపంచాయతీని అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# ఏపీ, తెలంగాణ ప్రయాణికులకు శుభవార్త

### సంక్రాంతికి మరికొన్ని ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, మహా :** సంక్రాంతి పండగ సమీపిస్తున్న వేళ ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. ఇప్పటికే పలు ప్రత్యేక రైళ్లు ప్రకటించగా తాజాగా మరో 16 ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించారు. వేర్వురు ప్రాంతాల నుంచి ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయని ఓ ప్రకటన ద్వారా తెలిపింది.

**ప్రత్యేక రైళ్లు**

సికింద్రాబాద్ శ్రీకాకుళం (ట్రైన్ నెంబర్ 07288) మధ్య జనవరి 9 , 11 తేదీల మధ్ స్పెషల్ ట్రైన్ నడవనుంది. ఈ ట్రైన్ రాత్రి 7 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరునాడు మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం చేరుకుంటారు. ఇక శ్రీకాకుళం సికింద్రాబాద్ మధ్య జనవరి 10, 12 తేదీల్లో స్పెషల్ ట్రైన్స్ ఉంటాయి. ఈ ట్రైన్ మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీకాకుళం నుంచి బయల్దేరి.. మరునాడు ఉదయం 8.10 నిమిషాలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ ట్రైన్స్ చర్లపల్లి, కాజీపేట, ఖమ్మం, రాజమండ్రి, అన్నవరం, తుని, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలసం స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక సికింద్రాబాద్ శ్రీకాకుళం (ట్రైన్ 07290) జనవరి 10,12,16,18 తేదీల్లో ట్రైన్స్ ఉంటాయి. అంతేకాకుండా జనవరి 11, 13, 17, 19 తేదీల్లో శ్రీకాకుళం సికింద్రాబాద్(07291)



మధ్య ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. వికారాబాద్ శ్రీకాకుళం మధ్య జనవరి 13వ తేదీన ట్రైన్ అందుబాటులో ఉంటుంది. ఇక జనవరి 14వ తేదీన శ్రీకాకుళం సికింద్రాబాద్ మధ్య స్పెషల్ ట్రైన్ ఉంటుంది. ఈ ట్రైన్స్ లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, రాజమండ్రి, అన్నవరం, తుని, అనకాప్లి, దువ్వాడ, కొత్తవలసం, విజయనగరం మీదుగా రాకపోకలు సాగిస్తాయి. జనవరి 17వ తేదీన సికింద్రాబాద్ శ్రీకాకుళం, జనవరి 18వ తేదీన శ్రీకాకుళం సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుంది. ఈ సేవలను వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన ద్వారా కోరింది.

## వాయిదా పడ్డ తొలి సమావేశం

### 22న కొలువుదీరనున్న పంచాయతీలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠభరితంగా సాగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఘట్టం ముగియడంతో, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించేందుకు సమాయత్తమవుతున్నారు. అయితే, వీరి ప్రమాణ స్వీకార తేదీలో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. తొలుత ఈ నెల 20వ తేదీన (శనివారం) రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలలో తొలి సమావేశం నిర్వహించి, ప్రమాణ స్వీకారం చేయించాలని భావించారు. కానీ, వివిధ జిల్లాల నుంచి ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల నుండి వచ్చిన వినతులను, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ రాజ్ శాఖ ఈ తేదీని సవరించింది. అందరికీ అనుకూలంగా ఉండేలా, సర్పంచుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీకి (సోమవారం) మారుస్తూ పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని ఎన్నికలు పూర్తైన అన్ని గ్రామ పంచాయతీలలో 22వ తేదీన తొలి సమావేశం జరుగుతుంది. ఆ రోజే నూతన సర్పంచులు, సభ్యులు అధికారికంగా తమ పదవీ బాధ్యతలను స్వీకరిస్తారు.

# ఓవైసీ గడ్డ ఉగ్రవాదుల అడ్డాగా మారింది

### గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరిక

**హైదరాబాద్, మహా :** ఆస్ట్రేలియా సిడ్నీలోని ఉగ్రవాద కాల్పుల ఘటనకు హైదరాబాద్ కనెక్షన్ ఉండటం కలకలం రేపడమే రాజకీయంగానూ అలజడి రగిలిస్తోంది. ఈ ఘటనపై గోషామహల్ ఎమ్మెల్యే, బీజేపీ బహిష్కృత నేత టి.రాజాసింగ్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి హెచ్చరికలు చేశారు. ఉగ్రవాదం విషయంలో కఠినంగా వ్యవహరించకుండా బుజ్జగింపు రాజకీయాలు చేసుకుంటూ వెళితే ఇక్కడ కూడా భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు. సిడ్నీలోని బాండి బీచ్ వద్ద హనుక్కా వేడుకల సమయంలో జరిగిన కాల్పుల ఘటనను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచంలో ఎక్కడ ఉగ్రదాడి జరిగినా దాని వెనుక మూలాలు హైదరాబాద్‌తోనే ముడిపడుతున్నాయి. ముఖ్యంగా ఓల్డ్ సిటీ ఉగ్రవాదులకు అడ్డాగా మారింది" అంటూ రాజాసింగ్ నేరుగా ఆరోపణలు చేశారు. "దేశంలో ఎక్కడ అలజడి రేగినా దానికి మూలాలు హైదరాబాద్ ఓల్డ్‌సిటీలో కనిపిస్తాయి. టోలీచౌకీలో ఒకప్పుడు నివసించిన వ్యక్తి ఇప్పుడు విదేశాల్లో ఉగ్రదాడి చేశారు. టోలీచౌకి ఓవైసీ పార్లమెంట్ స్థానం" అంటూ రాజాసింగ్ కామెంట్ చేశారు ఆస్ట్రేలియాలో జరిగిన ఉగ్రదాడిని తేలకగా తీసుకోవద్దని రాజాసింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. టోలీచౌకి వ్యక్తికి సంబంధం ఉన్నందున అతని బంధువులను విచారణ చేయాలని సూచించారు.'ఓటుబ్యాంక్, బుజ్జగింపు రాజకీయాలు చేస్తే తెలంగాణ భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని' హెచ్చరించారు ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి కళ్లు తెరవాలని ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇంటెలిజెన్స్ నిఘాను బలపరచాలని సూచించారు. "ఓవైసీతో దోస్తీ ఇవాళ కాకపోతే రేపైనా చేటు చేస్తుంది. దానిని వదిలేయండి.



## అత్యధిక మెజారిటీ ఆకుతోటపల్లి సర్పంచ్ దే

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా 12 గ్రామాలకు ఈ నెల 14న ఎన్నికలు జరిగాయి. కోనాపూర్ గ్రామపంచాయతీ ఏకగ్రీవం అయ్యారు. ఆమనగల్లు మండల వ్యాప్తంగా ఆకుతోటపల్లి స్వతంత్ర అభ్యర్థి న్యాలపట్ల నరేందర్ రెడ్డి తన ప్రత్యర్థిపై 597 ఓట్ల మెజారిటితో గెలుపొందారు.ఈ 12 గ్రామపంచాయతీ లో అత్యధిక మెజారిటీ గెలిచారు. గ్రామాభివృద్ధికి కృషి చేసేందుకు రాజకీయాల్లోకి దిగిన ఆయనకు ప్రజలు పట్టం కట్టారు.గ్రామంలో సమస్యలు పరిష్కరించి, గౌరారం, ఆకుతోటపల్లి పాఠశాల అభివృద్ధికి, తోడ్పడ్డారు.

# వీకర్స్ కాలనీలో రోడ్డు కొరకు రచ్చ

- లే ఔట్ ప్లాన్ లో లేని రోడ్డుకు కాలనీ వాసుల పట్టు
- కొండా దంపతుల వద్దకు చేరిన రోడ్డు పంచాయితీ

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోనే మొట్టమొదటి కుడా లేఔట్ గా ది కాశిబుగ్గ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరుతో ఏర్పడింది. ఆజంజాహి మిల్లు కు చెందిన 16 ఎకరాల 25 గుంటల భూమిని కుడా వారు విక్రయించి 1987 సంవత్సరంలో లేఔట్ చేసి 4/87 డిపి నెంబర్ తో అప్రూవల్ ఇచ్చి సొసైటీకి అప్పచెప్పడం జరిగింది. దీనికి అన్ని అనుమతుల తో పాటు పార్కు, రోడ్లు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కాగా ఇందులో 55 వ సర్వే నెంబర్ లో గల 179 ప్లాట్ నెంబర్ లో గల స్థలాన్ని మూడు ప్లాట్లు గా విభజించి సొసైటీ వారు స్థానిక పెద్దలకు అందజేసినట్లు సమాచారం. వారిలో ఒకరైన స్థానిక కార్పొరేటర్ ఓని భాస్కర్ కు 100 గజాలు రాగా ఆ స్థలాన్ని 2010లో రిజిస్ట్రేషన్ చేసుకుని అవసరాల నిమిత్తం 2016 లో ప్రహరీ గోడ తో సహా ఇతరులకు అమ్మడం జరిగింది. వారు కూడా వారి అవసరాల కోసం 2023లో మాలిక్ అనే వ్యక్తికి అమ్మడం జరిగిందని తెలుస్తోంది. మార్కెట్ వాల్యూ తో పాటు సరైన పత్రాలతో మాలిక్ కొనుగోలు చేసిన ఈ స్థలంలో ఇల్లు నిర్మాణం చేపట్టేందుకు సిద్ధం కాగా ఈ స్థలం రోడ్డుకు సంబంధించిందని కాలనీవాసులు ఇన్ని సంవత్సరాలకు రోడ్డు ఎక్కారు. గతంలో రోడ్డు ను ఆక్రమించి ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వీకర్స్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.



కానీ ఈ స్థలంలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు లేదని ఇది పూర్తిగా సరైన పత్రాలతో విక్రయించిన స్థలంగా ఇటీవల అధికారులు కూడా నిర్ధారించినట్లు సమాచారం. వీకర్స్ కాలనీకి రోడ్డు ఉన్నప్పటికీ కొంతమంది పనికట్టుకొని కూడా లేఅవుట్ ప్లాన్ లో లేని రోడ్డు ను సృష్టించి వారికి నేరుగా రోడ్డు కావాలనే ఉద్దేశంతో ఈ స్థలాన్ని వివాదంలోకి నెట్టుతున్నారని స్థల యజమాని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ వివాదాన్ని పోలీసులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మాకు న్యాయం చేయాలని యజమాని వేసుకుంటున్నాడు.

**స్థలం పంచాయితీ కొండా దంపతుల చెంతకు**

ఈ పంచాయితీ ని ఇరువర్గాలు కొండా దంపతులను వేరువేరుగా సంప్రదించారు. మంగళవారం మంత్రి కొండా సురేఖను వీకర్స్ కాలనీ మహిళలు కాలనీ వాసులు కలిసి రోడ్డు కోసం అభ్యర్థించారు. కాగా ఆ స్థలాన్ని సరైన పత్రాల తో పాటు అక్కడి మార్కెట్ వాల్యూ తో విక్రయించిన మాలిక్ కుటుంబీకులు బుధవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని కలిసి తమ గోడును విన్నవించుకోగా స్పందించిన కొండా మురళి సంబంధిత అధికారులకు నిజానిజాలను పరిశీలించి స్థల వివాదాన్ని త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.


# అయ్యప్పనామస్మరణతో మారుమోగిన మహా పడిపూజ

### హిమాయత్ నగర్ లో అయ్యప్ప స్వామి ఇరుముడి మహాపడి పూజ

**మొయినాబాద్ మహా:** స్వామి శరణం అయ్యప్ప శరణం స్వామియే శరణం అంటూ హిమాయత్ నగర్ గ్రామం అయ్యప్ప నామస్మరణం మారుమోగింది. హిమాయత్ నగర్ అయ్యప్ప సన్నిధానం స్వాములు మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. బుధవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలో అయ్యప్ప సన్నిధానం స్వాములు మండల కాలం దీక్ష పూర్తి చేసుకొని బుధవారం శబరిమల యాత్రకు బయలుదేరారు. గురుస్వాములు సురేష్, సంగమేశ్వర్ గురుస్వాములు అయ్యప్ప స్వాములకు ఇరుముడులు కట్టారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణం భజన కీర్తనలతో అందర్నీ ఆకట్టుకుంది. జాతీయ రహదారి హైదరాబాద్‌బీజాపూర్ ఆనుకొని విజయ్ రాజ్ ఠాకూర్ ఫంక్షన్ హాల్ లో అయ్యప్ప పూజను ఘనంగా నిర్వహించారు. దీంతో అయ్యప్ప మనస్మరణం మారుమోగింది. ఈ సందర్భంగా గురుస్వామి పూజా విధానాన్ని గణపతి పూజతో ప్రారంభించి కుమారస్వామి పూజ నిర్వహించి అయ్యప్ప స్వామికి



పూలు పండ్లు నైవేద్యం నూతన వస్త్రాలు సమర్పించి మహా మంగళహారతి సమర్పించారు. అనంతరం 18 మెట్లపై ఏర్పాటుచేసిన కర్పూర హారతిని గురుస్వాములు వెలిగించారు. దీంతో విజయ్ రాజ్ ఠాకూర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శనంతో పాటు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల అయ్యప్ప స్వాములు ఆయా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావడంతో పూజ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.



## గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తాను :మహ్మద్ ఖదీర్

**ఆమనగల్లు, మహా:** మాడ్గుల మండలం గిరికొత్తపల్లి మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో భాగంగా 2వవార్డుసభ్యుడిగామహ్మద్ ఖదీర్ విజయం సాధించారు. గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ గా ఎన్నికయ్యారు.వార్డు సభ్యుల మద్దతుతో ఆయన ఎంపిక జరిగినట్లు అధికారులు ప్రకటించారు. గ్రామాభివృద్ధికి అంకితభావంతో పని చేస్తారనే విశ్వాసంతో సభ్యులు ఆయనకు మద్దతు తెలిపారు. ఈ ఎన్నిక గ్రామ పంచాయతీలో ఐక్యత, సమైక్యతకు బలమైన నిదర్శనంగా నిలిచింది. పెద్దలు, వార్డు సభ్యులు ఉప సర్పంచు కు శుభాకాంక్షలు తెలిపారు. ఓటు వేసి గెలిపించిన గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామంలో అంబరాన్నంటేలా సంబరాలు నిర్వహించారు.



## బిజెపి పరకాల మాజీ వైస్ చైర్మన్ దేవునూరి మేఘనాథ్‌కు పరామర్శ


### పరకాల బిజెపి కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాదరావు

**పరకాల, మహా:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పరకాల మాజీ వైస్ చైర్మన్ దేవునూరి మేఘనాథ్ తండ్రి దేవుని చిన్న చంద్రయ్య ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అమరేందర్ రెడ్డి పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ రాష్ట్ర నాయకులు గుజ్జా సత్యనారాయణ రావు మాజీ అధ్యక్షులు మార్త బిక్షపతి దయ్యాల దేవరాజు సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు

# గిరిజన వసతి గృహంలో పురుగుల అన్నం కలకలం

- షాద్ నగర్ గిరిజన బాలుర వసతి గృహంలో దారుణం
- నాణ్యతలేని భోజనంతో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రమాదం
- విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు తప్పవు
- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** షాద్ నగర్‌లోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో బుధవారం రాత్రి డిన్నర్ సమయంలో విద్యార్థులకు అందించిన అన్నంలో పురుగులు కనిపించడంతో తీవ్ర భయాందోళన నెలకొంది. భోజనం చేస్తున్న సమయంలోనే ఈ విషయం గమనించిన విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ కు , విద్యార్థి సంఘాలకు సమాచారం అందించారు. ఈ ఘటనపై స్పందించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ గిరిజన కళాశాలలు, వసతి గృహాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషపూరితమైన, నాణ్యతలేని భోజనాలతో గిరిజన విద్యార్థుల జీవితాలను అనా



రోగ్యాల బాట పట్టిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని అధికార యంత్రాంగం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అవి ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. ఇలాంటి నిర్లక్ష్య ధోరణి కొనసాగితే విద్యార్థుల భద్రతపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ఈ ఘటనపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## మర్రిగూడ గ్రామపంచాయతీలో భర్త పాష వార్డు మెంబర్, భార్య నజియా సర్పంచ్ గా గెలుపు

**హుజూర్ నగర్ మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలంలోని మర్రిగూడ గ్రామానికి చెందిన షేక్ నజియా పాషా కాంగ్రెస్ అభ్యర్థిగా సర్పంచ్ గా కత్తెర గుర్తుతో పోటీ చేయగా భర్త షేక్ పాషా ఏడవ వార్డు మెంబర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గౌను గుర్తుపై పోటీ చేయడం జరిగింది భర్త వార్డు మెంబర్గా 25 ఓట్ల మెజార్టీ తోటి గెలుపొందగా భార్య సర్పంచ్ అభ్యర్థిగా 52 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు గ్రామంలో మొత్తం 8 వార్డులు గాను 5 వార్డులు కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందగా మిగతా 3 వార్డు లు బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. భార్య సర్పంచ్ గా భర్త వార్డ్ మెంబర్ గా ఒకే కుటుంబం నుండి గెలుపొందడంతో నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరి కూడా గ్రామపంచాయతీని నియోజకవర్గంలోనే ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలిపేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశీస్సులతో కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు

# శంషాబాద్‌ను జోన్‌గా మార్చాలి

### ధర్నాతో దద్దరిల్లిన శంషాబాద్...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజకీయ జేఏసీ కోన్నెమొల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థి సంఘాలు కుల సంఘాలు ధర్నాలు రాస్తారోకలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని జిహెచ్ఎంసి పాలకవర్గంలోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు శంషాబాద్ జోన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా శంషాబాద్ లో నాలుగు డివిజన్లను ఏర్పాటు చేయాలన్నారు. శంషాబాద్ జోన్ ఏర్పాటు చేస్తూ ప్రకటన వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని జెఏసి చైర్మన్ కోన్నెమొల్ల శ్రీనివాస్ తెలిపారు. మోహన్ రావు, మాడపతి పరమేశ్వరి నరేందర్, పరంధాములు, వెంకట్ రెడ్డి, జయసింహ, రమేష్ రమేష్ రాథోడ్, చరణ్ హనుమంతు, శేఖర్, నరేందర్, యాదయ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





మహా పత్రిక



# అప్పటిలోపు వారణాసి షూటింగ్ అయిపోద్ది..


గత నెలలో రాజమౌళిమహేశ్ బాబు సినిమా లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. 'వారణాసి' అని టైటిల్ ప్రకటించారు. మూడున్నర నిమిషాల ఓ వీడియోని కూడా రిలీజ్ చేశారు. అయితే దీన్ని హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ ఆవిష్కరిస్తారని అప్పుడు రూమర్స్ వచ్చాయి కానీ అదేం జరగలేదు. కానీ ఇప్పుడు రాజమౌళిజేమ్స్ కామెరూన్ మధ్య 'వారణాసి' గురించి డిస్కషన్ నడిచింది. సెట్‌కి వచ్చి కెమెరా పట్టుకుని సీన్స్ తీస్తానని కామెరూన్ చెప్పడం విశేషం.

జేమ్స్ కామెరూన్ తీసిన లేటెస్ట్ సినిమా 'అవతార్ 3'.. ఈ శుక్రవారం థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థ 20th సెంచరీ ఫాక్స్ స్టూడియో స్పెషల్ ఇంటర్వ్యూ చేసింది. రాజమౌళి ఇక్కడే ఉండగా.. వీడియో కాల్ ద్వారా కామెరూన్ జక్కన్నతో మాట్లాడారు. మిగతా విషయాలు ఏమో గానీ 'వారణాసి' గురించి చేసుకున్న డిస్కషన్ అభిమానులకు ఫుల్ కిక్ ఇస్తోంది. 'వారణాసి' సినిమా సంగతేంటి అని కామెరూన్ అడగ్గా.. ఏడాది నుంచి షూటింగ్ చేస్తున్నామని, మరో ఏడెనిమిది నెలల్లో పూర్తవుతుందని రాజమౌళి చెప్పుకొచ్చారు. 'వారణాసి' షూటింగ్, సెట్స్ చూడాలని ఉందని చెప్పిన కామెరూన్.. కెమెరా పట్టుకుని తాను కూడా కొన్ని సీన్స్ తీస్తానని అన్నారు. అలానే 'పులులతో ఏదైనా షూట్ ప్లాన్ చేస్తుంటే చెప్పు' అని కామెరూన్ సరదాగా అన్నారు. దీంతో ఇద్దరూ నవ్వుకున్నారు. రాజమౌళి చెప్పిన దానిబట్టి చూస్తుంటే వచ్చే ఏడాది ద్వితియార్థానికి షూటింగ్ అయిపోతుందనమాట. అంటే చెప్పినట్లు 2027 వేసవిలో రిలీజ్ చేస్తారనమాట.




# నాన్న చదువుకోలేదు..

## ఆయనకు చదువంటే చాలా ఇష్టం





ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడలో హీరో నాగార్జున సందడి చేశారు. అక్కినేని నాగేశ్వరరావు కళాశాల డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్‌లో పాల్గొన్నారు. కాలేజీ కోసం రూ.2 కోట్లని విరాళంగా ప్రకటించారు. ఈ క్రమంలోనే తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

అక్కినేని నాగేశ్వరరావు, అన్నపూర్ణమ్మ పేర్ల మీద కళాశాల విద్యార్థులకు రూ.2 కోట్ల స్కాలర్‌షిప్‌ని నాగార్జున ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ.. నాన్నగారు స్థాపించిన ఏ సంస్థ అయిన నాకు ఎంతో ప్రత్యేకం. గుడివాడ రావడం భావోద్వేగంగా ఉంది. ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంతో పాటు గర్వంగానూ ఉంది. మనుషులు శాశ్వతం కాదు వారు చేసే పనులే శాశ్వతం. తాను చదువుకో లేకపోయినా వేలాదిమంది చదువు, వారి బంగారు భవిష్యత్తు కోసం నాగేశ్వరరావు కళాశాల స్థాపించారు.

రైతు బిడ్డ అయిన నాగేశ్వరరావుకు చదువు అంటే ఆయనకు ఎంతో ఇష్టం. సినిమాకు రూ. 5 వేలు వచ్చే 1951 సంవత్సరాల్లో లక్ష రూపాయలని కళాశాలకు విరాళంగా ఇచ్చారు. ఏఎన్ఆర్ కళాశాలలో చదివిన విద్యార్థులు ఇప్పుడు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. నా తరపున నా కుటుంబ సభ్యుల తరపున ప్రతియేటా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తాను. గుడివాడలో నాపై చూపుతున్న ప్రేమాభిమానాలకు చేతులెత్తి నమస్కరిస్తున్నా అని నాగార్జున చెప్పుకొచ్చారు.

అక్కినేని నాగేశ్వరరావు విషయానికొస్తే.. దాదాపు ఏడు దశాబ్దాల పాటు 255కు పైగా తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో నటించారు. 'ధర్మపత్ని' (1941)తో ప్రారంభించి 'సీతారామ జననం' (1944)లో తొలి హీరోగా మారి, 'దేవదాసు' (1953)తో స్టార్‌డమ్ అందుకున్నారు, పౌరాణిక, జానపద, సామాజిక పాత్రలతో పాటు 'నవరాత్రి'లో తొమ్మిది పాత్రలు పోషించారు, 'అన్నపూర్ణ స్టూడియోస్' స్థాపించి, 'మనం' (2014) చిత్రంలో చివరగా నటించారు. తెలుగు సినిమాను మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తరలించడంలో ఈయన కీలక పాత్ర పోషించారు.

ఏఎన్నార్ తర్వాత నాగార్జున హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం నాగ్ తెలుగు, తమిళంతో పాటు హిందీలోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ ఏడాది 'కుబేర', 'కూలీ' చిత్రాల్లో నాగ్ వైవిధ్యమైన పాత్రలు చేసి ఆకట్టుకున్నారు.

# నేను పెళ్లి చేసుకోలేదు

"నేను ఇప్పటి వరకు ఎవర్నీ పెళ్లి చేసుకోలేదు. నాకు ఎవరితోనూ వివాహం కాలేదు" అంటూ హీరోయిన్ మెహరీన్ స్పష్టం చేశారు. నాని హీరోగా హను రాఘవపూడి దర్శకత్వం వహించిన 'కృష్ణగాడి వీరప్రేమగాథ'(2016) సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చారు మెహరీన్. ఆ తర్వాత 'మహానుభావుడు, రాజా ది గ్రేట్, ఎఫ్ 2, ఎఫ్ 3' వంటి పలు హిట్ సినిమాల్లో నటించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేకమైన అభిమానం సొంతం చేసుకున్నారు మెహరీన్. నటిగా బిజీగా ఉన్న సమయంలోనే బీజేపీ నాయకుడు భవ్య బిష్ణోయ్‌తో నిశ్చితార్థం చేసుకున్న ఈ బ్యూటీ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారనుకున్నారంతా. ఆ తర్వాత ఆ నిశ్చితార్థం రద్దు అయిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... మెహరీన్ రహస్యంగా పెళ్లి చేసుకున్నారనే వార్తలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ న్యూస్‌పై మెహరీన్ స్పందించి, సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. "నేను సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్నానంటూ కొన్ని ఆంగ్ల వెబ్‌సైట్స్‌లో ఆర్టికల్స్ వచ్చాయి. అందులోనూ నాకు తెలియని, ఎప్పుడూ కలవని వ్యక్తిని పెళ్లి చేసుకున్నానని రాశారు. నా వికీపీడియా పేజీని ఎవరో హ్యాక్ చేసి, 'రెండు నిమిషాల పాపులారిటీ' కోసం ప్రయత్నించిన ఒక నీచుడి పని ఇది. నా వివాహం విషయంలో రెండేళ్లుగా మౌనంగా ఉన్నప్పటికీ, ఈసారి వేధింపులు హద్దులు దాటడంతో నిజం చెప్పక తప్పలేదనిపించింది. నేను ఇప్పటి వరకు ఎవర్నీ పెళ్లి చేసుకోలేదు. నాకు ఎవరితోనూ వివాహం కాలేదు.. నన్ను నమ్మండి. భవిష్యత్తులో పెళ్లి చేసుకునే నిర్ణయం తీసుకుంటే మాత్రం ఆ విషయం ప్రపంచం మొత్తానికి తెలిసేలా చెబుతాను.. ప్రామిస్" అంటూ పేర్కొన్నారు మెహరీన్. ప్రస్తుతం ఆమె పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.





# గర్ల్స్ గ్యాంగ్‌తో లంకకు వెళ్లిపోయిన రష్మిక

పాన్ ఇండియా సినిమాలతో రష్మిక ఫుల్ బిజీగా ఉంది. ఈ ఏడాది ఈమె నుంచి ఐదు సినిమాలు వచ్చాయి. వీటి కంటే ఈమెకు గత నెలలో హీరో విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం జరిగిందనే విషయం చర్చనీయాంశంగా మారింది. ఇది నిజమని ఇప్పటివరకు అటు రష్మిక గానీ ఇటు విజయ్ గానీ బయటపెట్టలేదు. కానీ ఈమె చేతికి ఉన్న రింగ్ మాత్రం ఇదంతా నిజమని చెప్పకనే చెబుతోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోనున్నారనే రూమర్స్ వస్తున్నాయి. మరి ఇందులో నిజానిజాల సంగతి పక్కనబెడితే ఇప్పుడు రష్మిక.. తన గర్ల్స్ గ్యాంగ్‌తో కలిసి శ్రీలంక ట్రిప్ వేసింది. బీచ్, రిసార్ట్స్‌లో ఫుల్ చిల్ అవుతూ కనిపించింది. ఈమెతో పాటు హీరోయిన్ వర్ష బొల్లమ్మ, కాస్ట్యూమ్ డిజైనర్ శ్రావ్య వర్మ కనిపించారు. మిగిలిన స్నేహితులు ఎవరనేది పెద్దగా తెలియదు. 'నాకు ఈ మధ్యే రెండు రోజుల బ్రేక్ దొరికింది. నా గర్ల్స్‌తో పాటు చిల్ అయ్యే ఛాన్స్ దొరికింది. మేం శ్రీలంకలోని ఈ అందమైన ప్రదేశానికి వెళ్లాం. గర్ల్స్ ట్రిప్స్.. ఎంత చిన్నవి అనేది సమస్య కాదు. నా గర్ల్స్ బెస్ట్' అని రష్మిక.. తన శ్రీలంక ట్రిప్ జ్ఞాపకాల్ని పోస్ట్ చేసింది. అయితే ఇది ఈమె బ్యాచిలరేట్ పార్టీ అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. చూస్తుంటే అలానే అనిపిస్తుంది కూడా. రష్మిక చేతిలో ఇప్పుడు మైసా, రెయిన్ బో అనే చిత్రాలున్నాయి.

# రష్మిక ది గర్ల్‌ఫ్రెండ్..

## మరో క్రేజీ రికార్డ్..!

రష్మిక ప్రధాన పాత్రలో వచ్చిన లేటెస్ట్ మూవీ ది గర్ల్‌ఫ్రెండ్. గత నెలలో థియేటర్లలో రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ నిలిచింది. దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటించిన ఈ మూవీకి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. విడుదలైన ఐదు రోజుల్లోనే రూ.20 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఓవరాల్‌గా రూ.28 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. అయితే కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. ప్రస్తుతం ఈ సూపర్ హిట్ మూవీ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులో ఉంది. తాజాగా ఈ సినిమా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచంలోనే ఓటీటీలో అత్యధికంగా వీక్షించిన నాన్‌ఇంగ్లీష్ చిత్రాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సింగర్ చిన్మయి శ్రీపాద ట్వీట్ చేసింది. ది గర్ల్‌ఫ్రెండ్ పోస్టర్‌ను షేర్ చేసింది. కాగా.. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించారు.

### ది గర్ల్‌ఫ్రెండ్ కథేంటంటే?

భూమా (రష్మిక మందన్నా) తండ్రి (రావు రమేశ్)చాటు కూతురు. పీజీ చదివేందుకు తొలిసారి తండ్రిని వదిలి నగరానికి వెళ్లి ఓ కాలేజీలో చేరుతుంది. అదే కాలేజీలో విక్రమ్ (దీక్షిత్ శెట్టి), దుర్గ (అను ఇమ్మాన్యుయేల్) కూడా చేరతారు. దుర్గ.. విక్రమ్‌ను ప్రేమిస్తే.. అతడు మాత్రం భూమాను లవ్ చేస్తాడు. ప్రేమ జోలికి వెళ్లకూడదనుకుంటూనే భూమా కూడా అతడితో ప్రేమలో పడిపోతుంది. తర్వాత ఏం జరిగింది? భూమా జీవితం విక్రమ్ కంట్రోల్‌లోకి వెళ్లిందని తెలుసుకుని ఆమె ఏం చేసింది? అన్నదే మిగతా కథ.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034